శ్రీకాకుళం లోక్‌సభ అభ్యర్థులు

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
		
కె.రామ్మోహన్‌నాయుడు	పేరాడ తిలక్	పేడాడ పరమేశ్వరరావు



ఎన్నికల బరిలో 86 మంది

ఇక సమరమే!

- ముగిసిన నామినేషన్ల ఉప సంహరణ
- శ్రీకాకుళం లోక్‌సభకు 13 మంది పోటీ
- 8 అసెంబ్లీ స్థానాలకుగానూ 73 మంది పోరుకు సన్నద్ధం


(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగిసింది. అభ్యర్థుల లెక్క తేలింది. ఇక అసలు సమరం మొదలు కానుంది. జిల్లాలో శ్రీకాకుళం లోక్‌సభ స్థానానికి గానూ 13మంది, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ 73మంది.. మొత్తంగా 86 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. శ్రీకాకుళం లోక్‌సభకు టీడీపీ నుంచి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వైసీపీ నుంచి పేరాడ తిలక్, కాంగ్రెస్ నుంచి పేడాడ పరమేశ్వరరావు పోటీ చేస్తున్నారు. మిగిలిన పది మందిలో ఐదుగురు అభ్యర్థులు ఇతర పార్టీలు, మరో ఐదుగురు ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచారు.

అసెంబ్లీ నియోజకవర్గాలను పరిశీలిస్తే..

- ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి 9 మంది బరిలో ఉన్నారు. టీడీపీ నుంచి బెందాళం అశోక్, వైసీపీ నుంచి పిరియా విజయ, కాంగ్రెస్ నుంచి మాసుపత్రి చక్రవర్తి రెడ్డి పోటీలో ఉన్నారు. ముగ్గురు ఇండిపెండెంట్ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.
- పలాస నియోజకవర్గం నుంచి 10మంది బరిలో ఉన్నారు. టీడీపీ నుంచి గౌతు శిరీష, వైసీపీ నుంచి సీదిరి అప్పలరాజు, కాంగ్రెస్ నుంచి మజ్జి త్రినాథ్‌బాబు పోటీలో ఉన్నారు. ఇతరపార్టీలతోపాటు ముగ్గురు స్వతంత్రులు బరిలో దిగారు.
- ఆమదాలవలసలో 13 మంది బరిలో ఉన్నారు. టీడీపీ నుంచి కూన రవికుమార్, వైసీపీ నుంచి తమ్మినేని సీతారాం, కాంగ్రెస్ నుంచి సనపల అన్నాజీరావు పోటీ చేస్తున్నారు. ఐదుగురు ఇండిపెండెంట్‌గా పోటీకి దిగారు.
- నరసన్నపేట నుంచి ఏడుగురు పోటీలో ఉన్నారు. టీడీపీ నుంచి బగ్గు రమణమూర్తి, వైసీపీ నుంచి ధర్మాన కృష్ణదాస్, కాంగ్రెస్ నుంచి మంత్రి నరసింహమూర్తి పోటీలో ఉన్నారు. ఇద్దరు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు.
- శ్రీకాకుళం నుంచి ఏడుగురు పోటీలో ఉన్నారు. టీడీపీ నుంచి గొండు శంకర్, వైసీపీ నుంచి ధర్మాన ప్రసాదరావు, కాంగ్రెస్ పార్టీ నుంచి అంబటి కృష్ణారావు బరిలో ఉన్నారు. ఇతరపార్టీల నుంచి మరో నలుగురు పోటీ చేస్తున్నారు.
- పాతపట్నం నుంచి టీడీపీ తరపున మామిడి గోవిందరావు, వైసీపీ నుంచి రెడ్డి శాంతి, కాంగ్రెస్ నుంచి కొప్పురోతు వెంకట్రావు పోటీచేస్తున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నలుగురు ఉన్నారు.
- ఎచ్చెర్ల నుంచి పది మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్డీఏ కూటమి తరపున బీజేపీ నుంచి నడుకుదిటి ఈశ్వరరావు, వైసీపీ నుంచి గొర్లె కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నుంచి కరిమజ్జి మల్లేశ్వరరావు పోటీ చేస్తున్నారు. ఇండిపెండెంట్‌గా నలుగురు పోటీచేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులను పోలిన పేర్లతో మరో ఇద్దరు స్వతంత్రంగా నిలిచారు.
- టెక్కలి నుంచి ఏడుగురు బరిలో నిలిచారు. టీడీపీ నుంచి కింజరాపు అచ్చెన్నాయుడు, వైసీపీ నుంచి దువ్వాడ శ్రీనివాస్, కాంగ్రెస్ నుంచి కృపారాణి పోటీలో ఉన్నారు. ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. టెక్కలి, ఆమదాలవలసలో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులకు గాజుగ్లాసు గుర్తును కేటాయించారు. జిల్లాలో జనసేన అభ్యర్థులెవరూ పోటీ లేకపోవడంతో... ఈ గుర్తుపై గందరగోళం ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.


ప్రధాన పార్టీల అసెంబ్లీ అభ్యర్థులు వీరే

నియోజకవర్గం	టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
శ్రీకాకుళం	 గొండు శంకర్	 ధర్మాన ప్రసాదరావు	 అంబటి కృష్ణారావు
టెక్కలి	 కింజరాపు అచ్చెన్నాయుడు	 దువ్వాడ శ్రీనివాస్	 కిల్లి కృపారాణి
పలాస	 గౌతు శిరీష	 సీదిరి అప్పలరాజు	 మజ్జి త్రినాథ్ బాబు
ఇచ్ఛాపురం	 బెందాళం అశోక్	 పిరియా విజయ	 ఎం. చక్రవర్తి రెడ్డి
ఆమదాలవలస	 కూన రవికుమార్	 తమ్మినేని సీతారాం	 సనపల అన్నాజీరావు
ఎచ్చెర్ల	 ఎన్.ఈశ్వర రావు (బీజేపీ)	 గొర్లె కిరణ్‌కుమార్	 కరిమజ్జి మల్లేశ్వరరావు
నరసన్నపేట	 బగ్గు రమణమూర్తి	 ధర్మాన కృష్ణదాస్	 మంత్రి నరసింహమూర్తి
పాతపట్నం	 మామిడి గోవిందరావు	 రెడ్డి శాంతి	 కొప్పురోతు వెంకటరావు



కొబ్బరి పార్క్ కలేనా?

తితలీ తుఫాన్ దెబ్బకు నెలకొరిగిన కొబ్బరిచెట్లు (ఫైల్)



మోసం గురూ!



నల్లముట్టె తెగులు ఆశించిన కొబ్బరి చెట్టు

- అమలు కాని పాదయాత్ర హామీ
- సీఎం అయ్యాక పట్టించుకోని జగన్
- ఉద్దానం ప్రాంత రైతులకు కన్నీరే
- ఆర్థికంగా తప్పని ఇబ్బందులు

(కవిటి)

ఉద్దానంలో కొబ్బరి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆరేళ్ల కిందట వచ్చిన తితలీ తుఫాన్ దెబ్బకు పంట అంతా నాశనమైంది. కొబ్బరి పంటను కాపాడి.. రైతులను ఆదుకుంటామన్న నేతల హామీలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. పాదయాత్ర సమయంలో.. గత సార్వత్రిక ఎన్నికల ముందు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉద్దానంలో పర్యటించారు. తాము అధికారంలోకి వస్తే కొబ్బరిపార్క్ ఏర్పాటు చేస్తామని, రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకూ ఆ దిశగా కార్యచరణ చేపట్టలేదు. దీంతో రైతులకు ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో సీఎం ఇచ్చిన హామీకే దిక్కులేదంటూ రైతులు నిట్టూర్పుతున్నారు. కొబ్బరిపార్క్ ఏర్పాటు కలగానే మిగిలిందని ఆవేదన చెందుతున్నారు. కొబ్బరి పంటకు మద్దతు ధర కూడా ఎన్నికల హామీగానే మిగిలిపోతోందని వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లాలోని కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో 35వేల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. కొబ్బరి పంటపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. వరుసగా తుఫాన్లు, తెగుళ్ల బెడదతో కొబ్బరి రైతులకు పంట నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కొబ్బరి పంట నాశనమైంది. నిత్యం పచ్చదనంగా కనిపించే ఉద్దానంలో కొబ్బరి మొక్కలు ఎండిపోతున్నాయి. తెల్లదోమ, నల్లముట్టె, కొమ్ముపురుగు, కాండం తొలుచు పురుగు సోకి.. పంట పాడైపోయింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. తెగుళ్ల తాకిడితో ఎకరా తోటలో కనీసం 200 కొబ్బరికాయలు కూడా దిగుబడి రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. కొబ్బరి పంటకు మద్దతు ధర కల్పిస్తామని నేతలు హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేయడం లేదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం తమ కష్టాలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఒకప్పుడు కొబ్బరికి ప్రధాన మార్కెట్‌గా నిలిచిన కంచిలి నుంచి కూడా ఉత్తరాదికి ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో చాలామంది కార్మికులు కూడా ఉపాధి కోసం వలస బాట పట్టారు. అలాగే నష్టాల బారిన పడిన కొంతమంది రైతులను తమ కొబ్బరి తోటలను రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించేస్తున్నారు. ఈ క్రమంలో సాగు తగ్గుముఖం పడుతోంది. ఈ పరిస్థితులు మారాలంటే.. కొబ్బరిపార్క్ నిర్మించాలని, మద్దతు ధర కల్పించాలని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం విఫలం



ఉద్దానంలో కొబ్బరిపంట అభివృద్ధి కలగా మిగిలింది. కొబ్బరిపార్కు ఏర్పాటు చేస్తామన్నారే తప్ప.. ఆ దిశగా చర్యలు లేవు. తెగుళ్ల తాకిడితో పంట రోజురోజుకీ దిగజారిపోతోంది. కొబ్బరిచెట్టును కాపాడటం కష్టంగా మారింది. గిట్టుబాటు ధర.. హామీగానే మిగిలింది. ఉద్దానం రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలమైంది.

-బి.చిన్నబాబు, రైతు, బల్లిపుట్టుగ

యువకులు వలస బాట



ఉద్దానంలో కొబ్బరిపంటనే నమ్ముకొని జీవనం సాగించలేక యువకులు వలసబాట పడుతున్నారు. వరుసగా తుఫాన్ల తాకిడితో కొబ్బరిపంటపై ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. వ్యవసాయం చేస్తే అప్పులు మిగులుతున్నాయి. కుటుంబాన్ని పోషించుకోవాలంటే సంపాదనకు గ్రామాన్ని విడిచి వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది.

-పాండు దొళాయి, రైతు, బల్లిపుట్టుగ



వాహనదారుడిపై దౌర్జన్యానికి పాల్పడుతున్నవైసీపీ శ్రేణులు

ధర్మాన అనుచరుల దౌర్జన్యం

శ్రీకాకుళం రూరల్, ఏప్రిల్ 29: ఎన్నికల ప్రచారంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు అనుచరులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. శ్రీకాకుళం మండలం కుందువానిపేటలో సోమవారం మంత్రి ధర్మాన ప్రసాదరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలో టీడీపీ నేత, మాజీ సర్పంచ్ సూరాడ అప్పన్న ఇంటి వద్ద ప్రచార రథాన్ని నిలిపారు. ఆ సమయంలో అప్పన్న ఇంటి ముందు ద్విచక్ర వాహనం ఉండగా.. దానిని పక్కకు తీయాలని ఓ వైసీపీ నాయకుడు మైక్‌లో చెప్పారు. దీంతో వాహనదారుడు వచ్చి ద్విచక్రవాహనాన్ని పక్కకు తీస్తుండగా.. మంత్రి ధర్మాన అనుచరుడు ఒకరు తిట్ల దండకాన్ని అందుకున్నాడు. మంత్రి దగ్గర మెప్పు పొందేందుకు వాహనదారుడిపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ప్రచార రథంపై ధర్మాన ఉన్నారంటూ.. కొంతమంది అనుచరులు వాహనదారుడిని పక్కకు నెట్టేశారు. ఇంత జరుగుతున్నా.. ధర్మాన వారిని సముదాయించలేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత అధికార అహంకారం ఉండకూడదని, ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా.. ఓట్లు అడగానికి ఎలా వచ్చారంటూ పలువురు గుసగుసలాడుకున్నారు.

కిడ్నీవ్యాధితో ఒకరి మృతి

పలాస రూరల్, ఏప్రిల్ 29: పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన మద్దిల జోగారావు(35) కిడ్నీవ్యాధితో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. అయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. ఇటీవల కిడ్నీబాధిత మృతుల సంఖ్య పెరుగుతుండడంతో ఉద్దానం ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి పూర్తిస్థాయిలో కిడ్నీ వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎన్నికల విధులకు ఎన్‌సీసీ క్యాడెట్లు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఏప్రిల్ 29: ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లను ఎన్నికల విధులకు వినియోగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 13న పోలింగ్ జరుగనున్న రోజు సామాజిక సేవ, స్వచ్ఛంద ప్రాతిపదికన వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,358 పోలింగ్ కేంద్రాలున్నాయని, ఒక్కో కేంద్రానికి ఒక్కొక్కరు చొప్పున 18 ఏళ్లు నిండిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లను వినియోగిస్తామన్నారు. దీనికి సంబంధించి వారి తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రాలు తీసుకోవాలన్నారు. వీరికి శాంతిభద్రతల పనులు అప్పగించబోమని, కేవలం ఓటరు సహాయం కోసం మాత్రమే వినియోగిస్తామన్నారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లా డుతూ.. జిల్లాలో ఎన్‌సీసీ క్యాడెట్లు 852 మంది అందుబాటులో ఉన్నారని, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 1774మంది ఉన్నారన్నారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ త్రినాథరావు, ఎన్‌సీసీ ఏఎన్‌వో వై.పోలినాయుడు, 14వ ఎన్‌సీసీ బెటాలియన్ తరపున షేక్ కమాల్, జితేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో రూ.29.5 లక్షలు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 29: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి వద్ద రూ.29.50లక్షల నగదును సర్వేలైన్స్ బృందం పట్టుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. విశాఖపట్నానికి చెందిన కలిదిండి వెంకటేశ్వర రాజు కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం ఏసీ బస్సులో ఓ బ్యాగుతో ప్రయాణిస్తున్నాడు. శ్రీకాకుళం సింహద్వారం వద్ద సర్వేలైన్స్ అధికారులు బస్సును ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో వెంకటేశ్వరరాజు బ్యాగులో రూ.29.50లక్షల నగదు దొరికింది. దీనిపై వెంకటేశ్వరరాజును వివరణ కోరగా మెళియాపుట్టిలో ఏకలవ్య స్కూల్ నిర్మాణానికి ఈ నగదు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఆ నగదును సర్వేలైన్స్ బృందంలోని డిప్యూటీ తహసీల్దార్ నానిబాబు.. శ్రీకాకుళం తహసీల్దార్ రాణికి అందజేశారు. ఆ మొత్తాన్ని ట్రెజరీకి అప్పగించారు.



నగదు స్వాధీనం చేసుకున్న సర్వేలైన్స్ అధికారులు

ఉల్లివలస చెక్ పోస్టు వద్ద..

జి.సిగడాం: ఉల్లివలస చెక్‌పోస్టు వద్ద ఎటువంటి ఆధారాలు లేని నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం చీపురుపల్లి నుంచి రాజాం వైపు స్కూటీపై వస్తున్న నూరు జయరాం వద్ద రూ.75,500 పట్టుబడింది. ఆ నగదును రణస్థలం ఆర్వోకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

శ్రీకాకుళం జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. శ్రీకాకుళం				
2. ఎచ్చెర్ల				
3. ఆమదాలవలస				
4. నరసన్నపేట				
5. పాతపట్నం				
6. టెక్కలి				
7. పలాస				
8. ఇచ్ఛాపురం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : ఎచ్చెర్ల గ్రామం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా., ఆంధ్రప్రదేశ్., పిన్: 532410

స్థానిక సంస్థలతోనే తొలి అడుగు

- చట్టసభల్లో ప్రవేశించిన పలువురు జడ్పీ చైర్మన్లు
- సర్పంచ్‌లు, ఎంపీపీలు, మునిసిపల్ చైర్‌పర్సన్లు కూడా
- మంత్రులుగా కూడా ప్రాతినిధ్యం వహించిన వైనం
- బెండి కూర్మన్నకు అరుదైన అవకాశం

(రణస్థలం)


ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో చట్టసభల్లో ప్రవేశించిన పలువురు తొలుత స్థానిక సంస్థల్లో వివిధ రకాల పదవులు అలంకంచారు. తొలి అడుగు గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల నుంచే పడింది. శాసనసభకు ఎన్నికై మంత్రులుగా కూడా ప్రాతినిధ్యం వహించారు. జడ్పీ చైర్మన్లగా పనిచేసిన పలువురు ఎమ్మెల్యేలుగా ఎన్నికై మంత్రి పదవులను సైతం అలంకరించారు. విజయనగరం జిల్లా ఏర్పాటు కాక ముందు ఆ ప్రాంతం కూడా శ్రీకాకుళం జిల్లాలో అంతర్భాగంగానే ఉండేది. అక్కడి ప్రజాప్రతినిధులు కూడా తొలుత స్థానిక సంస్థల్లోనే ప్రాతినిధ్యం వహించారు.

ఏకకాలంలో జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేగా ఎన్నిక..

- శ్రీకాకుళం జడ్పీకి తొలి చైర్మన్‌గా బెండి కూర్మన్న 1960-62లో పనిచేశారు. అదే సమయంలో ఆయన శాసనసభ్యుడిగా కూడా వ్యవహరించారు. ఏకకాలంలో జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పనిచేసిన అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు.
- ప్రస్తుత విజయనగరం జిల్లా తెర్లాం ప్రాంతానికి చెందిన వాసిరెడ్డి కష్ణమూర్తినాయుడు 1963-64లో ఏడాది పాటు శ్రీకాకుళం జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆయన తెర్లాం నుంచి పలుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై సుదీర్ఘకాలం మంత్రిగా సేవలందించారు. అతి కీలక మైన ఇరిగేషన్, హోం శాఖలను చేపట్టి ఆ పదవులకే వన్నె తెచ్చారు. ఆయన కృషి ఫలితం గానే బొబ్బిలిలో ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం ఏర్పాటైంది. ఇటీవల వరకు శ్రీకాకుళం జిల్లా ఇరిగేషన్ కార్యాలయం కూడా బొబ్బిలి ఎస్ఈ సర్కిల్ పరిధిలోనే ఉండేది.
- రణస్థలం మండలం పాతర్లపల్లికి చెందిన గొర్లె శ్రీరాములునాయుడు 1964-69, 1970-74, 1981-83 మధ్య శ్రీకాకుళం జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికై ఇరిగేషన్‌శాఖ మంత్రిగా కూడా పనిచేశారు. ఆయన మంత్రిగా ఉండగానే మడ్డువలస ప్రాజెక్ట్‌కు పునాది రాయిపడింది. ఆ తర్వాత 1983లో టీడీపీ ప్రభంజనంలో చీపురుపల్లి నుంచి శ్రీరాములునాయుడు పోటీచేసి త్రిపురాన వెంకటరత్నం (టీడీపీ) చేతిలో ఓడిపోయారు.
- 1974-76, 2006-11 మధ్యలో రెండుసార్లు జడ్పీ చైర్మన్‌గా పని చేసిన పాలవలస రాజశేఖరం 1994లో ఉణుకూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్పటి ఎన్నికల్లో ఉత్తరాంధ్రలోని 37 నియోజకవర్గాల్లో 36 స్థానాల్లో టీడీపీ ప్రభంజనం సృష్టించగా, కేవలం ఉణుకూరులోనే కాంగ్రెస్ విజయం సాధించింది. రాజ్యసభ సభ్యునిగా కూడా రాజశేఖరం వ్యవహరించారు.
- జలుమూరు మండలం అచ్యుతాపురానికి చెందిన బగ్గు లక్ష్మణరావు 1983-85లో జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత 1994లో నరసన్నపేట నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
- జడ్పీచైర్‌పర్సన్‌గా డాక్టర్ కిమిడి మృణాళిని 1987-92, 1995-2000 మధ్య ప్రాతినిధ్యం వహించారు. 2014 ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. చంద్రబాబు కేబినెట్‌లో మూడేళ్లపాటు మంత్రిగా వ్యవహరించారు.

మరికొందరు నేతలు..

జిల్లాలో పలువురు నేతలు స్థానిక సంస్థలతోనే రాజకీయ ప్రవేశం చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికాకముందు సర్పంచ్, ఎంపీపీ, తదితర పదవులు అలంకరించారు. ● శ్రీకాకుళం ఎంపీగా, టెక్కలి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన హనుమంతు అప్పయ్యదొర వజ్రపుకొత్తూరు బెండి సర్పంచ్‌గా పనిచేశారు. ● మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పోలాకి మండలం మబగాం సర్పంచ్‌గా, పోలాకి ఎంపీపీగా పనిచేశారు. ● ఆమదాలవలస నుంచి గతంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన కూన రవికుమార్ పొందూరు ఎంపీపీ, జడ్పీటీసీగా వ్యవహరించారు. ● శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మునిసిపల్ వైస్‌చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ●శ్రీకాకుళం మునిసిపల్ చైర్మన్‌గా, శాసనసభ్యునిగా పసగాడ సూర్యనారాయణమూర్తి ప్రాతినిధ్యం వహించారు. ● ఆమదాలవలసకు రెండుసార్లు శాసనసభ్యురాలిగా ప్రాతినిధ్యం వహించిన బొడ్డేపల్లి సత్యవతి మునిసిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ● జి.సిగడాం మండలం ఆర్సీహెచ్ అగ్రహారం సర్పంచ్‌గా, జి.సిగడాం ఎంపీపీగా పనిచేసిన మీసాల నీలకంఠంనాయుడు ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు.





అక్కడ పూర్తికాలం పదవిలో ఉండాల్సిందే..

మీకు తెలుసా?

హిరమండలం: మన దేశంలో ప్రజాప్రతినిధుల రాజీనామా అన్న పదాన్ని తరచూ వింటుంటాం. అవినీతి ఆరోపణలు వచ్చిన సమయంలో, బాధ్య తలను సరిగా నిర్వర్తించని సమయంలో పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుంటాయి. మన చట్టసభ సభ్య త్వానికి రాజీనామా చేయాలంటే ఆ పత్రాన్ని స్పీకర్‌కు అందించవచ్చు. బ్రిటన్‌లో అను సరించే విధానం భిన్నంగా ఉంటుంది. బ్రిటిష్ పార్ల మెంట్‌కు ఎన్నికైన సభ్యుడు తన పదవీ కాలం పూర్త య్యే వరకు పదవిలో ఉండాల్సిందే. రాజీనామా అన్న పదమే ఉండదు. 300 ఏళ్ల కిందటే అక్కడి చట్టసభల్లో పార్లమెంట్ సభ్యులు రాజీ నామా చేసేందుకు వీలు లేకుండా తీర్మానించారు. ఓటరు ఇచ్చిన తీర్పుకు విలువ ఇవ్వాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసు కున్నారు. అక్కడ ఎన్నికైన వ్యక్తి పూర్తికాలం పదవిలో ఉండి ప్రజలకు సేవ చేయాల్సిందే.

పీపుల్స్ మేనిఫెస్టో



ప్రాజెక్టులకు మోక్షం కల్పించాలి

పలాస: జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం కల్పించాలి. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేస్తామని 16 ఏళ్లుగా ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నాయి. 25 వేల ఎకరాల సాగునీరు, ఐదు మండలాల రైతులకు వినియోగపడే దీన్ని వెంటనే పూర్తి చేయడానికి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలి.

-ధర్మపురం అనిల్‌శర్మ, పలాస

పెద్దల మాట



ఓటు కోసం నడిచి వెళ్లే వాళ్లం

(సరుబుజ్జిలి)

ఈ ఎన్నికలకు నేను 16వ సారి ఓటు వేయనున్నా ను. 1952లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన బొడ్డేపల్లి రాజగోపాలరావుకు తొలిసారి ఓటు వేశాను. అప్పట్లో జరిగిన ఎన్నికల ప్రచా రానికి మొదట్లో నాటు బళ్ల, కొన్నాళ్ల తర్వాత విశాఖ నుంచి ఆటోలను తీసుకొచ్చి ప్రచారం చేసేవారు. మా ప్రాంతమంతా వంశధార నది అవతల ఉన్న నగరికట కం నియోజకవర్గంగా ఉండేది. నియో జకవర్గ కేంద్రాని కి చేరుకోవాలంటే ఎటువంటి వంతెన ఉండేది కాదు. నది దాటుకొని వెళ్లేవారం. నగరికటకం నియోజకవర్గం గా ఉన్న సమయంలో గ్రామానికి చెందిన ఓటర్లంతా రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న ప్రస్తుత ఎల్ఎన్ పేట మండలంలోని సిద్దాంతం గ్రామంలో ఓటు వేయ డానికి కాలినడకన వెళ్లేవాళ్లం. కొత్త గా ఆమదాలవలస నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారి జరిగిన ఎన్నికల్లో కూడా సిద్ధాంతం గ్రామంలోనే ఓట్లు వేయాల్సి వచ్చింది. **-సనపల రాములు (102), పెద్దమతలబుపేట, సరుబుజ్జిలి**

ఎంచుకో.. ఓటు వినియోగించుకో..

● ఓటరు మనోగతం

(హిరమండలం)

'ప్రతి మనిషితోనూ ఏదో ఒక రోజు అవసరం వస్తుంది' అనేది నానుడి. కానీ ఇది నా విషయంలో ఈ రోజు రుజువైంది. కష్టాలు పడుతున్నా.. కన్నీరు ఒలుకుతున్నా.. బాధలు వినేవారు కరువయ్యారు. 2019లో నా విలువ తెరపైకి ఇచ్చింది. మళ్లీ ఐదేళ్లకు గానీ నేనేంటో తెలియరాలేదు. అయితే అప్పటికీ ఇపట్పికి ఎన్నోమార్పులు వచ్చాయి. రాజ్యాంగం ప్రసాదించిన హక్కును తమ వైపు తిప్పుకునేందుకు ఎన్నెన్నో కుయుక్తులు పన్నారు. మద్యం, డబ్బు, బంగారం, ఇలా ఎన్నో ఎరలు వేశారు. ఓటు హక్కు వినియోగం గురించి తన అంతరాత్మను అడుగుతాను అదేమి చెబుతుందో..! అని ఓటరు తనలో తాను ఆలోచించసాగాడు.

● **ఓటరు:** గత ఎన్నికలకు ఇప్పటికి నా స్టైల్ మారింది. హోదా పెరిగింది. నే చెప్పేదే వేదం. చేసిందే శాసనం.

● **మనసు:** ఆ బడాయంతా ఒక్కరోజే. పోలింగ్ బూత్‌లోకి వెళ్లాచ్చావా. తరువాత నీ ముఖం కూడా చూసేవాడు కూడా లేడు.

● **ఓటరు:** ఈ ప్రచారాలు విని...బుర్ర పోతుందిరా బాబు. పోలింగ్ కేంద్రానికి వెళ్లాలంటావా.?

● **మనసు:** ఒరేయ్.. ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించిన వరం. మంచి వ్యక్తికి ఓటు వేసి నీతో పాటు సమాజానికి మేలు చేకూర్చు. ఓటుహక్కు వినియోగించుకోకపోవడం తప్పు.

● **ఓటరు:** మామూలుగా కష్టాల్లో ఉంటే అవసరానికి అప్పులిచ్చేవాడే లేడు. కానీ రెండురోజులుగా అన్నో..ఇదిగో నీ కోసం ఇంటికి పంపించా. ఇంట్లో వాళ్లందరికీ అవసరాలకు వాడుకోండి. అంటూ తెలిసనోళ్లు. తెలియనోళ్లూ అందరూ ప్రేమానురాగాలు కురిపించే వారే.

● **మనసు:** ఆగు..ఆగు.. మెరిసేదంతా బంగారం కాదు. ప్రేమతో మాట్లాడే వారందరూ నీ శ్రేయోభిలాషులూకారు. ప్రలోభాలతో మాయచేస్తారు. నీ అంతరాత్మనైన నన్ను.. నాకు తెలియకుండానే మాయచేస్తున్నారు. ఇక నీవెంత..బచ్చావి. ప్రలోభాలకు లొంగకపోవడానికి..!

ఇంతలో 'ఏం.. సుబ్బయ్య గారు.. ఓటేశారా'.. మాట వినిపించగానే.. అంతరాత్మ మాయమైంది. నా విలువ గమనిద్దామని ఆ నాయకునికి ఆ.. ఇప్పుడే ఓటు వేసి వచ్చా అన్నాను.

ఓటు వేసేశావా.. సరే.. సుబ్బిగా.. ఇంటికెళ్లు.. సమాధానంతో ముచ్చెమటలు పట్టాయి.

కాసేపటికి అంతరాత్మ ప్రత్యక్షమై.. చూశావా.. నేను చెబితే విన్నావా.. ఏరుదాటేదాక మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న.. చందం తెలుసుగా.. ఇదే నీ పరిస్థితి.. ఆచితూచి అడుగేయ్..

● **ఓటరు:** అది సరే గానీ. 'వాళ్ల డబ్బులు తీసుకొని మాకు ఓటేయండి' అని నాయకులంటున్నారు. వాళ్ల దగ్గర సొమ్ములేవా..

● **మనసు:** అన్ని పార్టీలది అదేదారి. ఓటర్లు మభ్యపెట్టాలని ప్రయత్నించని వారంటూ లేరు. ఎవరి డబ్బైనా అది ప్రజాధనమే. ప్రజల డబ్బుతోనే వారి గాంభీర్యాలన్నీ. వాటిని చూసి మోసపోవద్దు.

● **ఓటరు:** నాయకుల కల్లబొల్లి మాటలు విని మోసపోయా. రేపటి నుంచి ఈ రోజుతో నుంచి ప్రచారం లేకపోవడంతో నీవు ప్రశాంతంగా ఉన్నట్టున్నావే.

● **మనసు:** అది నిజమే కానీ. ఎవరికి ఓటు వేయాలని నిర్ణయంతో నిద్ర పట్టడంలేదు. ఒకవిధంగా నీవే మేలు.. ఛీఛీ. నీ జబ్బు నాక్కూడా అంటుకునేలా ఉంది.

● **ఓటరు:** నా పరిస్థితి నీకు తెలుసుగా.. నా కర్తవ్యమేమిటో.. ప్రబోధించు.. ఎన్నాళ్లకు నా మాట వింటానన్నావురా. అని ఆకాశమంత ఎత్తుకు ఉప్పొంగిన అంతరాత్మ ఇలా చెప్పసాగింది.

● **మనసు:** గతంలో ఓటు అడగాలంటే.. పోటీదారులకు భయం ఉండేది. ప్రజలు తమ పరిపాలన గురించి ఎక్కడ నిలదీస్తారని ఆందోళన చెందేవారు. ఇప్పుడు ఓటు అభ్యర్థనకు వస్తున్నారంటే..ముందుగా ఆ రోజు గ్రామ మంతా డబ్బు, మద్యంతో హుషారెత్తిస్తున్నారు. ఇక వాళ్లను అడిగే వాళ్లు.. ఎవరు.వారు పాడిందే పాట. ఆడిందే ఆట. చెప్పిందే మాట. నాయకుడు ప్రజలకు మేలు చేకూర్చేలా. వారి సమస్యలను తనవిగా భావించి ముందుకు నడిచేతత్వం ఉండాలి. యువతకు మార్గనిర్దేశం చేయగలగాలి. రాజకీయాలకతీతంగా గ్రామాలను పట్టించుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలి. రైతులను తన కుటుంబ సభ్యుల్లా ఆదరించాలి. మంచి పాలనను అందించే వారే నిజమైన నాయకులు. ఎంచుకో ఓటు వినియోగించుకో.



అద్దెకు కార్యకర్తలు

తప్పదు మరి


- డబ్బులు ఇచ్చి సభలు, ర్యాలీలకు తీసుకెళ్తున్న రాజకీయ పార్టీలు
- జన సమీకరణకు తప్పని పాట్లు

(మెళియాపుట్టి)

అద్దెకు కార్యకర్తలు దొరుకుతారన్న మాట వినడానికి ఆసక్తిగా ఉన్నా వాస్తవమే. గతంలో రాజకీయపార్టీల నాయకులు స్వచ్ఛందంగా పిలిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చే వారు. ప్రస్తుతం ప్రజల ఆలోచన ధోరణి, వ్యవహార శైలి మారింది. ప్రతి పని డబ్బుతోనే ముడిపడి ఉంటున్నాయి. దీంతో రాజకీయ పార్టీల ప్రచారానికి డబ్బులు ఇవ్వనిదే ముందుకురావడం లేదు. జిల్లాలో ఇటీవల కాలంలో ఓ ప్రాంతంలో రెండు ప్రధాన పార్టీలు నిర్వహించిన ర్యాలీలు, సభలకు వచ్చిన వారే మళ్లీ రావడం విశేషం. దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు తమకు ఓటు వేస్తారోలేదనని సందేహం వ్యక్తంచేస్తున్నారు.

గత్యంతరం లేక...

జనసమీకరణలో విఫలమైతే ప్రత్యర్థి పార్టీలు విమర్శలు గుప్పిస్తాయని భావించి ఆయా పార్టీలు జిల్లా నాయకులు గ్రామస్థాయి నాయకులపై టార్గెట్లు విధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం పుణ్యమాని ఎవరూ ఖాళీగా ఉండడంలేదు. దీంతో సభలకు వెళ్తే తమ ఆదాయానికి గండిపడు తుందని పార్టీల ప్రతినిధులకు స్పష్టం చేస్తున్నారు. ఈనేపథ్యంలో గత్యంతరం లేక అద్దె కార్యకర్తలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇటీవల సీఎం జగన్ టెక్కలిలో నిర్వహించిన సిద్ధం సభతో పాటు అధికార పార్టీనాయకులు నామినేషన్ ర్యాలీకి సైతం అద్దె కార్యకర్తలను సేకరించి తీసుకువెళ్లడం విశేషం. ఇటీవల పాతపట్నంలో అధికార పార్టీ అభ్యర్థి నామినేషన్‌కు పాలకొండ నియో జకవర్గం పరిధి నుంచి పురుషులకు రూ.600, మహిళలకు రూ.400 ఇచ్చి తీసుకువచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కొంత మంది అభ్యర్థులు డబ్బులతో పాటు ఆటోలు అద్దెకు రూ.1000 ఇస్తున్నారు. నామినేషన్ కార్యక్రమానికి ఒక్కో అభ్యర్థికి రూ. రెండు కోట్లపైనే ఖర్చయినట్లు బహిరంగానే ప్రచారం జరుగుతోంది. కొంతమంది ఉపాధి పనులకు ఉదయం పూట వెళ్లి, తర్వాత సభలకు వెళ్లి, సాయంత్రం మళ్లీ పనులకు హాజరుకావుతున్నారు. ప్రస్తుతం అద్దె కార్యకర్తలకు భలే గిరాకీ ఉంది.





గోడలపై రాతలు మాయం


మారిన ప్రచారం

గతంలో ఎన్నికలు వచ్చాయంటే గోడ కనబడితే ప్రచార ప్రకటనలు కనిపించేవి. గోడలపై అభ్యర్థులు పేరు, పార్టీ, గుర్తు తదితర వివరాలు బొమ్మలుగా వేసే వారు. పదేళ్ల కిందటి వరకు ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఆయా పార్టీల నాయకులు ఖాళీగా ఉన్న గోడలను రిజర్వ్ చేసుకునేవారు. పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడమే ఆలస్యం. వెంటనే ప్రచార రాతలతో గోడలను నింపేసే వారు. ఎన్నికల సమయంలో వివాహం వంటి శుభకార్యాలు ఉన్నా సరే ఇంటింటికి రంగు వేయిం చుకునేందుకు యజ మానులు వెనుకాడేవారు. కాలక్రమేణ గోడమీద రాతలు మాయమయ్యాయి. సోషల్ మీడియా పుణ్యమాని మునుపటి ప్రచారం రాతలు కనుమరుగయ్యాయి. దీంతో అప్పటిదాకా గోడమీది రాతలతో ఉపాధి పొందుతున్న కార్మికులకు కూడా పనిలేకుండా పోయింది.

-గార

బూత్ కాప్చరింగ్‌కు పాల్పడ్డారో జైలే

మీకు తెలుసా?



హిరమండలం: ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవడం, అధికారులను బెదిరించి బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలు స్వాధీనం చేసుకోవడాన్ని బూత్ కాప్చరింగ్ అంటారు. ఎవరైనా కావాలని బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలను పాడు చేయడం, విరగ గొట్టడం ఎన్నికల గుర్తులపై సిరా పోయడం వంటివి ఇందులో భాగమే. పోలింగ్ కేంద్రంలో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్ అడ్డుకోవడం నేరం. ఇలాచేసే ప్రభుత్వ సిబ్బంది అయితే ఐసీసీ 1951 సెక్షన్ 135 ఏ, 136 ప్రకారం మూడు నుంచి ఐదు సంవత్సరాలు జైలుతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఇతరులైతే ఒకటి నుంచి మూడు సంవత్సరాల జైలు శిక్ష వేస్తారు.

జగనన్నా.. గొంతెండుతోంది!

వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇచ్ఛాపురం మండల ప్రజలను తాగునీటి సమస్యలు చుట్టుముట్టాయి. దీనికి ప్రధాన కారణం రక్షిత పథకాలను సర్కారు నిర్లక్ష్యం చేయడమే. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసి ఎన్టీఆర్ సుజలధార పథకాల నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో అవి మూలకు చేరాయి. కనీసం మర్మమతులు చేపట్టేందుకు రూపాయి కూడా విదల్చడం లేదు. పంచాయతీల అకౌంట్లలో కూడా నిధులు లేకపోవడంతో అధికారులు సైతం చేతులెత్తేశారు. దీంతో ప్రజలు చెలమలపైనే ఆధారప డుతున్నారు. కిలోమీటర్ల దూరంలోని సముద్ర తీరానికి వెళ్లి చెలమల నీటిని తోడుతున్నారు. మరికొందరు ప్రైవేటు వాటర్ ప్లాంట్లకు వెళ్లి నీటి క్యాన్లను కొనుగోలు చేస్తున్నారు.

- ఇచ్ఛాపురంలో తాగునీటి కష్టాలు
- చెలమలపైనే ఆధారపడుతున్న ప్రజలు
- సర్కారు నిర్లక్ష్యంతో మూలకు చేరిన రక్షిత పథకాలు
- కనీస మరమ్మతులు చేపట్టని వైనం
- చేతులెత్తేసిన పంచాయతీలు



డొంకూరు సముద్ర తీరంలో చెలమల వద్ద నీటి కోసం పాట్లుపడుతున్న మహిళలు

(ఇచ్ఛాపురం)

ఇచ్ఛాపురం మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది నీటి ఎద్దడి నెలకొంది. చెరువులు, బావులు ఎండిపోవడంతో పాటు భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. దీంతో తాగునీటికోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. గత ఏడాది అక్టోబరు, నవంబరులో ఆశించిన వర్షాలు లేకపోవవడంతో నీటి వనరులన్నీ ఎండి పోయాయి. ఈ తరుణంలో జగనన్నా గొంతెండుతోందని మహిళలు వాపోతున్నారు. ప్రచారానికి వస్తున్న నాయకులను నిలదీస్తున్నారు. ఇటువంటి ఘటన ఇటీవల పురుషోత్తంపురం, ఏఎస్‌పేట తదితర ప్రాంతాల్లో చోటుచేసుకుంది. పట్టణాల్లో కొంత మేర ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఆ ఊసే లేదు. ప్రధానంగా పంచాయతీల వద్ద ఉన్న ఆర్థికసంఘ నిధులు ప్రభుత్వం తీసుకోవడంతో నీటి వనరుల నిర్వహణకు ఒక్క రూపాయి సైతం లేకుండాపోయింది. దీంతో తాగునీటి పథకాలు, బోర్ల మరమ్మతులకు నోచుకోని పరిస్థితి నెలకొంది. గతంలో వేసవిలో ట్యాంకర్లతో పంచాయతీల్లో నీటిసరఫరాచేసే వారు. ప్రస్తుతం పంచాయతీల అకౌంట్లలో నిధులు లేకపో వడంతో నీటి సరఫరాకు పంచాయతీలు చేతులెత్తేశాయి. పంచాయతీ రాజ్ అధికార యంత్రాంగమంతా ఎన్నికల నిర్వహణలో తలమునకలు కావడంతో ఒక్కసారి కూడా నీటి సమస్యపై సమీక్షించిన దాఖలాలు లేవు. టీడీపీ హయాంలో శుద్ధజలాల పంపిణీకి ప్రారంభించిన ఎన్టీఆర్ సుజలధార పథకాలు వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూలకు చేరాయి. టీడీపీ పాలనలో తక్కువ ధరకే శుద్ధ జలాలు లభ్యమయ్యేవి. ప్రస్తుతం కిడ్నీవ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ఇక్కడ నీటికే ఎక్కువ వ్యయం చేయాల్సి వస్తోంది. దీంతో ప్రైవేటు వాటర్ ప్లాంట్లలో ఎక్కువ మొత్తం చెల్లించి శుద్ధ జలాలు కొనుగోలు చేస్తున్నామని పలువురు వాపోతున్నారు.

నీరుగారిన పథకాల నిర్వహణ

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలోని రక్షిత నీటి పథకాల నిర్వహణ నీరుగారింది. కనీసం మరమ్మతులకు సైతం నోచుకోవడం లేదు. జడ్పీ గ్రాంట్ కింద నీటి పథకాల నిర్వహణకు చర్యలు తీసుకోవల్సిఉంది. దీనికితోడు ఈ ప్రాంతానికి చెందిన పిరియా విజయ జడ్పీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడి వైసీపీ అభ్యర్థిగా కూడా ఆమె వ్యవహరిస్తున్నారు. చైర్‌పర్సన్ పదవి చేపట్టి నప్పటి నుంచి నీటి పథకాల నిర్వహణపై ఆమె దృష్టిసారించలేదన్న విమర్శలు ఉన్నాయి.



బలరాంపురంలో మూలకుచేరిన ఎన్టీఆర్ సుజలధార పథకం

ఇదీ మండలంలో పరిస్థితి

మండలంలో 21 పంచాయతీల పరిధిలో 49 గ్రామాలు ఉన్నాయి. 70 వేల మంది నివసిస్తున్నారు. ఇందులో డొంకూరు, బూర్జపాడు, చిన్న, పెద్ద లక్ష్మీపురం, శివకృష్ణాపురం, అరకభద్ర, టి.బరం పురం, కేదారిపురం, బెనిగానిపేట, ముచ్చింద్రల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. ఇక్కడ నివసిస్తున్న 40 వేల మంది చెలమలు, నేలబావుపైనే ఆధారపడుతున్నారు. అలాగే కేదారిపురం, ముచ్చింద్ర, మండపల్లి, బాలకృష్ణాపురం, టి.బరంపురం, డొంకూరుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఉద్దానం సమగ్ర నీటి పథకం పనులు పూర్తికాకపోవడంతో చెలమలు, స్థానికంగా ఉండే నేలబావులపై ఆధారపడుతున్నారు.

తీర గ్రామాల్లో అగచాట్లు

మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో తాగునీటికి అగచాట్లకు గురవుతున్నారు. డొంకూరు చిన్న, పెద్ద లక్ష్మీపురం, శివకృష్ణాపురం, టి.బరంపురం తదితర తీర గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. ఏడాది పొడువునా తాగునీటికి కష్టాలు పడుతున్నారు. ప్రధానంగా వేసవిలో ఈ ఇబ్బందులు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. వీరంతా సముద్ర తీరంలోని చెలమలపైనే ఆధారపడుతున్నారు. దశాబ్దాలుగా ఈ సమస్య ఎదుర్కొంటున్నా శాశ్వత పరిష్కారం లభించడంలేదు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు హామీఇస్తున్నా తాగునీటికి కష్టాలు గట్టెక్కడంలేదు.



డొంకూరులో చెలమల నీటిని పడుతున్న మహిళ

దట్టమైన తోటలు దాటుకుని..

డొంకూరులో 150 వరకు కుటుంబాల మహిళలు ప్రస్తుతం గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోని సముద్ర తీరం వద్ద దట్టమైన తోటలు దాటుకొని వెళ్తున్నారు. కొద్దిపాటి చెలమల నీరు సేకరించేందుకు గంటల తరబడి ఉండాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. ఇసుక దిబ్బలను లోతుగా తవ్వి కొంచం నీరు సేకరించి బిందె నిండితే చాలు అనుకోవల్సి వస్తోంది. చెలమల నుంచి సేకరించిన నీటిని మరగబెట్టి తాగేసరికి నురగ వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

ఏటా వేసవిలో ఇబ్బందులు



తాగునీటి కోసం ప్రతి రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వాటర్ స్కీములు ఉన్నా ఫలితం లేకుండాపోతోంది. ప్రతి ఏడాది వేసవిలో నీటి సమస్య ఎదురవుతోంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలో నీటి సమస్య కోసం ఎప్పుడూ పట్టించుకోలేదు. అధికారులకు తెలియజేసినా చర్యలుతీసుకోవడంలేదు.

-తిప్పన దుర్యోధనరెడ్డి, బెనుగానిపేట

వేకువజామున వెళ్తున్నాం



సముద్ర తీర ప్రాంతంలో నీటిఎద్దడి తీవ్రంగా ఉంది. నీటి సమస్య తీర్చే నాథుడే కరవయ్యాడు. తాగునీటి కోసం వేకువ జామున లేచి చెలమల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ కూడా గంటల సేపు ఉండాల్సి వస్తోంది. ఇంత కష్టపడినా బిందెడు నీరు మాత్రం దొరుకుతుంది. నీటి సమస్యకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

-బుడ్డ మేనక, డొంకూరు

తాయిలాలు ఇస్తే.. తాట తీస్తారు

- ఓటర్లను ప్రలోభపెడితే కేసులు
- నాయకా.. పారాహుషార్

(నరసన్నపేట)

సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరందుకుంది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీచేస్తున్న అభ్యర్థులు ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడంతో ఓటర్లకు తాయిలాలు ఇవ్వాలని చూసినా, మద్యం, నగదు పంపిణీతోపాటు నిషేధిత ప్రదేశాల్లో సమావేశాలు ఏర్పాటుచేసినా ఎన్నికల సంఘం తీవ్ర నేరంగా పరిగణిస్తుంది. వీటన్నింటిని పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక బృందాలతో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951, భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 171లో ఉన్న పలు సబ్‌సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే జరిమానా, శిక్ష లేదా రెండింటికి గురయ్యే ప్రమాదముంది.

కానుకల పంపిణీ నేరం

ఓటర్లకు నేరుగా ప్రలోభాలకు గురిచేస్తూ కానుకలు పంపిణీ చేయడం నేరం. అన్నదానం, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐపీసీ 171(ఇ) చట్టం కింద శిక్షార్హులవుతారు.

రెచ్చగొట్టినా.. కించపరిచినా

ఓట్ల కోసం కులం, మతం, సామాజిక వర్గాలను రెచ్చగొట్టేలా పలువురు వ్యాఖ్యలు చేస్తుంటారు. ఎదుటి వ్యక్తుల మనోభావాలను కించపరడం చేస్తారు. ఇలా జరిగితే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 125 కింద కేసు నమోదు చేస్తారు.

ప్రచార సమయం మీరొద్దు

అభ్యర్థులకు కేటాయించిన సమయాన్నే వినియోగించుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా మైకులు, డీజేలు, వివిధ రకాల ప్రచార సామగ్రి వినియోగించకూడదు. దీనికి ఐపీసీ 171(ఎఫ్) చట్టం కింద చర్యలు తీసుకుంటారు.

డబ్బులు పంచితే

ఓటర్లను తమ వైపునకు తిప్పుకొనేందుకు అభ్యర్థులు నగదు ఎరగా వేస్తారు. అక్రమ చెల్లింపులు పలు రకాలుగా పంపిణీ చేస్తుంటారు. ఇలా చేస్తే ఐపీసీ 171(హెచ్) కింద చర్యలు ఉంటాయి. అధికారులకు లంచం రూపంలో డబ్బులు ఇచ్చినా... ఓటర్లకు డబ్బులు పంచినా ఐపీసీ 171(బి) సెక్షన్ కింద చర్యలు తీసుకుంటారు.

ఓటర్లను బెదిరిస్తే

ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే హక్కు ఉంది. వారిని ఒత్తిడికి గురిచేయడం... బెదిరించడం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఇలా చేసినట్టు రుజువైతే బాధ్యులపై ఐపీసీ 171(సి) చట్టం కింద కేసు నమోదు చేస్తారు.


మద్యం సరఫరా చేస్తే

ఎన్నికలు అంటే డబ్బుల తర్వాత గుర్తుకొచ్చేది మద్యం. ప్రతి గ్రామంలోనూ రాజకీయ పక్షాలు మద్యం పంపిణీ చేస్తుంటాయి. నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి మూడు సీసాలకు మించి మద్యం తీసుకెళ్లడం నేరం. ఓటర్లకు పంపిణీ చేసేందుకు భారీ మొత్తంలో మద్యం రవాణా చేస్తూ పట్టుబడుతుంటారు. అలాంటి వారిపై అబ్కారీ చట్టం 1968 సెక్షన్ 34(ఎ) కింద కేసు నమోదు చేస్తారు. దీనికి ఆరు నెలల నుంచి ఏడాది వరకు శిక్ష, రూ.5 వేల నుంచి రూ. 20 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.



మరికొన్ని శిక్షలు ఇలా..

- సెక్షన్ 128: ఎన్నికల విధుల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికలకు సంబంధించిన విషయాలను రహస్యంగా ఉంచాలి.. ఉల్లంఘిస్తే మూడు నెలల జైలుశిక్ష.
- సెక్షన్ 129: విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఏపార్టీ అభ్యర్థికైనా అనుకూలంగా వ్యవహరించడం నేరం. ఈ నిబంధన అతిక్రమిస్తే ఆరు నెలలు జైలుశిక్ష.
- సెక్షన్ 130: పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలోప ప్రచారం నిర్వహించడం, ఓటర్లను అభ్యర్థించడం, ఇతర పార్టీ అభ్యర్థుల కు ఓటు వెయ్యొద్దని సూచించడం కూడా నేరమే.
- సెక్షన్ 131: పోలింగ్ స్టేషన్‌లో ఉన్న వ్యక్తులకు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి ఆగ్రహం తెప్పించేలా లౌడ్‌స్పీకర్లు, ఇతరత్రా సాధనాల ద్వారా ధ్వనులు చేయడం నిషేధం. అలాంటి దుశ్చర్యలకు పాల్పడే వ్యక్తులను అరెస్ట్ చేయాల్సిందిగా ప్రిసైడింగ్ అధికారులు పోలీసులకు సూచించవచ్చు. ఇలాంటి నిందితులకు మూడు నెలల జైలు, జరిమానా లేదా రెండూ విధించే అవకాశాలు ఉన్నాయి.



- సెక్షన్ 132: పోలింగ్ కేంద్రంలో చట్టవిరుద్ధంగా వ్యవహరించడం, అభ్యంతరకరంగా ప్రవర్తించడం, వివాదాస్పదంగా వ్యవహరించడం నేరం..అలాంటి వారిని అరెస్ట్ చేయాలని సూచించే అధికారం ప్రిసైడింగ్ అధికారులకు ఉంది. అలాంటి నేరాలకు మూడు నెలల జైలుశిక్ష.
- సెక్షన్ 133: ఎన్నికల రోజున ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించడం నేరం. ఎవరైనా వాహనాన్ని అద్దెకు తీసుకుని ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు సంబంధితపార్టీ వ్యక్తులకు శిక్ష పడుతుంది. మూడు నెలల వరకూ జైలుశిక్ష పడే వీలుంది.
- సెక్షన్ 135: పోలింగ్ కేంద్రం నుంచి ఎన్నికలకు సంబంధించిన పరికరాలను పట్టుకెళ్లేందుకు ప్రయత్నించడం నేరం. అలాంటి చర్యలకు ఇతరులను ప్రోత్సహించడం కూడా నేరమే. ఈ తరహా నేరానికి ఏడాది వరకు జైలుశిక్ష.
- సెక్షన్ 135 (ఎ): బూత్ క్యాప్చరింగ్‌లకు పాల్పడడం... పోలింగ్ కేంద్రాలను ఆక్రమించడం, ఓటర్లను పోలింగ్ కేంద్రంలోనికి వెళ్లకుండా బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి అరాచకాలకు పాల్పడితే నిందితులతో పాటు వారిని ప్రోత్సహించిన వారికి కూడా అయిదేళ్ల జైలుశిక్ష, జరిమానా తప్పనిసరి..
- సెక్షన్ 135 (సి): ఎన్నికలకు 48 గంటల ముందు నుంచి మద్యాన్ని పంపిణీ చేయడం నేరం. అమ్మకాలు కూడా నిషిద్ధం. దీనికి ఆరునెలల జైలు... రూ.రెండువేల జరిమానా విధించే అవకాశం కూడా ఉంది.
- సెక్షన్ 153 (ఎ): వివిధ వర్గాలు, గ్రూపు మధ శత్రుత్వం పెంచేలా వ్యవహరించినా... ప్రసంగించినా శిక్ష తప్పదు.
- సెక్షన్ 171 (బి): ఓటర్లకు డబ్బులిచ్చి ప్రలోభపెట్టాలని చూడడం నేరం.. ఆర్థిక సాయం పేరుతో డబ్బులివ్వడానికి ప్రయత్నిస్తే ఏడాది వరకూ జైలు శిక్ష తప్పదు.
- సెక్షన్ 171(ఐ): అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలను ఎన్నికలు ముగిసిన నెల రోజులలోపు ఈసీకి తప్పనిసరిగా అందించాలి. ఖర్చుకు సంబంధించి అభ్యర్థులు ప్రత్యేక ఖాతా తెరవాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు.

మీకు తెలుసా

ఆయన చండ 'శేషన్'

- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా వినూత్న సంస్కరణలు



రణస్థలం: టీఎన్ శేషన్. ఈపేరు వింటే 1990 ప్రాంతంలో రాజకీయ పార్టీలు బెంబే లెత్తిపోయేవి. ఆయన దెబ్బకు ఏకసభ్య కమిషన్‌ను త్రిసభ్య కమిషన్‌గా మార్చడం విశేషం. ఆయన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా వినూత్న సంస్కరణలకు తెరతీశారు. అప్పటి వరకు ఎన్నికల కమిషన్ గురించి కేవలం ఎన్నికల నిర్వహణ సమయంలోనే తెలిసేది. శేషన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాజ్యాంగపరమైన హక్కులను వినియోగించుకుని పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించారు. రిగ్గింగ్, బూత్ కాప్చరింగ్, దొంగ ఓట్లు వేయడం వంటి సంఘటనలకు ఫుల్‌స్టాప్ పడింది. ఎన్నికల నిర్వహణ, ప్రచారంలో మార్పులు తీసుకువచ్చా రు. శేషన్ అప్పటి వరకు పాతరేసిన నిబంధనలను బయటకు తీసి కచ్చితంగా అమలుచేశారు. 1990కు ముందు ప్రచారహోరు, గోడలపై రాతలు, లౌడ్‌స్పీకర్లను నియంత్రించారు. ఎన్నికల నిర్వహణ, ప్రచారానికి, అభ్యర్థుల ఖర్చులకు కచ్చితంగా నిబంధలను పాటించాల్సిం దేనని హుకుం జారీచేశారు. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు పరిమితికి మించి ఖర్చు చేయరాదని, ఎన్నికల వ్యయానికి పక్కాగా జమా ఖర్చులు చెప్పాల్సిందేని నిబంధన విధించా రు. ప్రచారంలో పాల్గొనే వాహనాలు, పత్రికలకు ఇచ్చే ప్రకటనలు, చివరకు కార్యకర్తలకు పెట్టే భోజనాలపై కూడా నిఘా పెరిగింది. దీంతో ఇప్పటికీ శేషనా.. మజాకా అంటూ వ్యాఖ్యానించడం వింటూఉంటాం.

పోలింగ్ రోజు ఏజెంట్లే కీలకం



నరసన్నపేట: ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరపున పరిశీలనకు కూర్చొనే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్ర మంగా జరుగుతుందా? లేదా? అన్నది గమనించడం, బోగస్‌ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చిన వారిని నిశితంగా పరిశీలించడం ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన, రిజిస్టర్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల తరపున ప్రాధాన్యతక్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో కూర్చొంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక ఏజెంట్ నిశి తంగా పరిశీలించాలి. ఏ మాత్రం అనుమానం వచ్చినా ఏజెంట్ తన అభ్యంతరాన్ని ప్రీసైడింగ్ అధికారికి తెలియజేయవచ్చు. ఎంతో కీలకమైన ఈ ఏజెంట్‌గా అభ్యర్థులు తమకు నమ్మకమైన వారిని కూర్చోబెడతారు. ఏజెంట్ ఏ మాత్రం తప్పు చేసినా, ఏపాటి ఆదమరిచి ఉన్నా ఆ పార్టీ అభ్యర్థికి నష్టమే కలుగుతుంది.



రాష్ట్రాన్ని కాపాడుకోవాలి: రవికుమార్



టీడీపీలో చేరిన గాజుల కొల్లివలస వైసీపీ నేతలతో రవికుమార్

సరుబుజ్జిలి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గెలిచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని ఆమదాలవలస నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్ కోరారు. సోమవారం పెద్దపాలెం, పాలవలస, రావివలస, పెద్ద వెంకటాపురం, వీరమల్లిపేట, సింధువాడ, పెద్ద సవలాపురం, మూల సవలాపురం, తురకపేట, కొండ్రగూడెం, కొత్తకోట గ్రామాల్లో శంఖారావం, సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ చేతకాని పాలనతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టిన సీఎం జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులను తాకట్టుపెడతాడని విమర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పేడాడ సూరప్పల నాయుడు, అంబల రాంబాబు, కిల్లి సిద్ధార్థ, పల్లి సురేష్, తల్లాడ సురేంద్ర, రాంబాబు, సురవరపు జగదీష్, తాడేల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 40 వైసీపీ కుటుంబాలు చేరిక

ఆమదాలవలస: ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసకి చెందిన 40 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి కూటమి అభ్యర్థి కూన రవికుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొలం శ్రీను, బి.ఉమారావు, కామరెడ్డి రాము, కామరెడ్డి కృష్ణ, చీపురు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఐటీడీఏ ఏర్పాటు: గోవిందరావు

పాతపట్నం: వైసీపీ పాలనలో అనాలోచిత నిర్ణయాలతో ఐటీడీఏను కోల్పోయామని ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. రంకిణి, బురికిపేట, బగంతర, దాసుపురం, కోడూరు, ఎగువప్రహరాజపాలెం తదితర గిరిజన గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ లేకపోవడం వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఐటీడీఏ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సింగుపురం తదితర గ్రామాల్లోనూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లా శారద, నేతలు శివాల చిన్నయ్య, నందిగామ ఆనందరావు, సలుగు గోవిందరావు, తూలుగు భుజంగరావు, కరకవలస మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం

పాతపట్నం: నియోజకవర్గ టీడీపీ క్లస్టర్, బూత్ చార్జిలు, నేతలతో స్థానిక కెఎస్ఎం ప్లాజాలో మంగళవారం ఉదయం 9గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సైల బాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి, ఎన్డీఏ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు హాజరుకానున్నారన్నారు. నియోజకవర్గపరిధిలోని క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు హాజరుకావాలని కోరారు.



ప్రచారం చేస్తున్న ఎన్డీఏ అభ్యర్థి మామిడి గోవిందరావు

బీఎస్సీ పారా మెడికల్ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం క్రైం: వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం విడు దల చేసిన బీఎస్సీ పారా మెడికల్ ఫలితాల్లో బొల్లినేని కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎనస్తీషియా విభాగంలో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచిన ఎస్.ఛటోపాధ్యాయను కళాశాల యాజమాన్యం సోమవారం అభినందించింది. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వర రావు మాట్లాడుతూ.. డయాలసిస్ విభాగంలో కళాశాల విద్యార్థి కోరాడ తరుణ్‌కుమార్ యూనివర్శిటీ స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించారన్నారు. ఈ పరీక్షల్లో 61 మంది విద్యార్థులకు గాను 11 మంది డిస్టింక్షన్‌లో, 44 మంది ప్రథమ శ్రేణి, ముగ్గురు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన వారికి బీఎస్సీ, డిప్లొమో పారామెడికల్, జీఎన్ఎం, బీపీ టీ కోర్సుల్లో, ఇంటర్ ఫెయిల్ అయిన వారికి ఓటి అసిస్టెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నా యన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి పద్మజ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

నిచ్చెనపై నుంచి పడి తాపీ మేస్త్రీ మృతి

నరసన్నపేట: బాడాం గ్రామంలో సోమవారం జరిగిన ప్రమాదంలో గొనపపేటకు చెందిన తాపీమేస్త్రీ కోడి శ్రీధర్ (39) మృతిచెందినట్లు ఏఎస్ఐ అసిరినాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలో ఎస్.సుద్గుణరావు ఇంటి నిర్మాణం పనులు చేపడుతున్న సమయంలో శ్రీధర్ ప్రమాదవశాత్తు నిచ్చెనపై నుంచి కిందకు పడి తలపై బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

టెక్కలి: నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో సోమవారం విద్యుదాఘాతినికి గురై వ్యక్తి గాయపడ్డాడు. ఫైబర్‌నెట్ పనులు నిమిత్తం విద్యుత్ స్తంభం ఎక్కిన సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగెలు తగలడంతో షాక్‌కు గురై కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వైద్య చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని రిక్షా కార్మికుడికి ..

శ్రీకాకుళం క్రైం: స్థానిక పాత బ్రిడ్జిపై రిక్షాలో పడుకున్న ఉన్న కార్మికుడిని కారు ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. వాంబే కాలనీకి చెందిన కె.రామారావు పాత బ్రిడ్జిపై పడుకుని ఉండగా మార్చిలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. అతడిని చూసిన సీఐ అవతారం వెంటనే స్పందించి చికిత్స అందించి కొత్త రిక్షాను ఇటీవల ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఎప్పటిలాగే రిక్షాలో పడుకుని ఉండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తున్న కారు రిక్షాను ఢీకొట్టింది. దీంతో రామారావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో మరో వ్యక్తి ద్వారా సమాచారం తెలుసుకున్న కరకవలస వడ్డిబాబు అనే వ్యక్తి అక్కడికి చేరుకుని రక్తపు మడుగులో ఉన్న రామారావును 108లో రిమ్స్‌కు తరలించారు. అక్కడ అవుట్ పోస్టు పోలీసులకు జరిగిన విషయం చెప్పడంతో ట్రాఫిక్ పోలీసు లకు సమాచారం అందించగా సీఐ అవతారం కేసు నమోదు చేశారు. రామారావు పరిస్థితి క్షీణించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా ప్రస్తుతం అతడికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులుతెలిపారు.

పిడుగు పడి ఐదుగురికి..

ఇచ్ఛాపురం: పిడుగు పాటుకు ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు ప్రాంతం సర్దాపురం సమీపంలోని ఒడిశా రాష్ట్రం బీ నోగాం గ్రామంలో ఇటుకుల బట్టీ పరిశ్రమకు చెందిన ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడ్డాయి. బీ నోగాంలో ఇటుకుల బట్టీలో పనిచేస్తూ చిన్న గుడిసెల్లో నివాసముంటున్న గుడిసె లపై పిడుగులు పడ్డాయి. ఈ ఘటనలో కమల కిరణ్, సుమిత్ లెహర్, ఇస్మిత్ లెహర్, సాలిని ఒగ్రెయ్యితోపాటు 10 ఏళ్ల చిన్నారి సంధ్య బగ్రేయ్ గాయాలపాలయ్యారు. బాధితులందరినీ ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స అందించారు. అందరూ కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. గాంధీ పార్కులో కొబ్బరి చెట్టుపై పిడుగుపడి కాలిపోయింది.

40 మద్యం సీసాలు పట్టివేత

పొందూరు: జి.సిగడాం మండలం సర్వేశ్వరపురంలో అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం సీసాలను ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఈబీ ఎస్సై ఈ.రామకృష్ణ సిబ్బందితో దాడిచేసి కె.త్రినాథరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

నలుగురు మత్స్యకారులపై కేసులు

రణస్థలం: చేపల వేట నిషేధ సమయంలో చేపల వేట చేసిన నలుగురు మత్స్యకారులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌డీవో గంగాధర్ తెలిపారు. జీరుపాలేనికి చెందిన అంబటి చిరంజీవి, బర్రి అప్పన్న, దమ్ము కాముడు, మహేందాత చట్టవ్యతిరేకంగా చేపల వేట చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. వీరికి సంబంధించిన లైసెన్సులు రద్దు చేయడంతో పాటు రూ.5 వేలు అపరాధ రుసుం వేయడం జరుగుతుందన్నారు.

అరాచక పాలనకు అంతం పలకాలి: బగ్గు

జలుమూరు (సారవకోట): గత ఐదేళ్లుగా రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ అరాచక పాలనకు రానున్న ఎన్నికల్లో ఓటుతో అంతం పలకాలని నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. ధర్మలక్ష్మీపురంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్సు పథకాలను వివరించారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ.. అమరావతి రాష్ట్ర రాజధానిగా చేసి రాష్ట్రాభివృద్ధి జరగాలంటే కూటమి తరఫున పోటీ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, సాధు కృష్ణారావు, చల్ల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

- **నరసన్నపేట:** టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోట్లతో ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణ మూర్తి ఆరోపించారు. సోమవారం పట్టణంలో హుడ్కో, ఇందిరానగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడును సీఎంగా చేయాలన్నారు. అనంతరం హుడ్కో కాలనీలో బూర్ల రమణ తదితర 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.
- **జలుమూరు:** శ్రీముఖలింగం పంచాయతీకి చెందిన ఆరుగురు గ్రామ వలంటీర్లు టీడీపీలో చేరారు. ఆదివారం రాత్రి సవరడ్డవనస పార్టీ కార్యాలయంలో వీరికి ఎంపీ రామ్మోహన్ నాయుడు, అసెంబ్లీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువాలు వేసి ఆహ్వానించారు. సర్పంచ్ తమ్మన్నగారి సతీష్‌కుమార్ నేతృత్వంలో చింతాడ ప్రసాద్, మజ్జి మాధవరావు యండ నారాయణరావు, బొంగు నాగార్జున, సూర శ్రీనాథ్, పల్లి అప్పన్న టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.



జలుమూరు: ధర్మలక్ష్మీపురంలో ప్రచారం చేస్తున్న బగ్గు రమణమూర్తి

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు ఇబ్బందులు

- ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌తో కలిసి ఎంపీ రోడ్‌షో

అరసవల్లి: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి చరమగీతం పాడాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ ఆధ్వర్యంలో నగర పరిధిలోని 3 డివిజన్లలో సోమవారం రోడ్ షో నిర్వహించారు. పాత బస్టాండు వద్ద ప్రారంభమైన రోడ్డు షో 7 రోడ్ల కూడలి, గుజరాతీపేట, రెల్లి వీధి, పాలకొండ రోడ్డు, రిమ్స్, బలగ కుమ్మరివీధి, బలగ మెట్టు వరకు సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ద్వారా మాత్రమే రాష్ట్రంలో అభివృద్ధి చెందుతుందని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, జనసేన నియోజకవర్గ కన్వీనర్ కోరాడ సర్వేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జిలు, పెద్ద ఎత్తున ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదులను కలిసిన కూటమి అభ్యర్థులు

కూటమి లక్ష్యాన్ని, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి విజయానికి సహకరించాలని ఎంపీ, ఎమ్మెల్యే కూటమి అభ్యర్థులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్ కోరారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ భవనంలో న్యాయ వాదులను కలిసి కూటమి లక్ష్యాలను వారికి వివరించారు.



రోడ్‌షో నిర్వహిస్తున్న కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్

పలు గ్రామాల నుంచి టీడీపీలోకి చేరికలు

పలాస/హరిపురం: మందస మండలం చిన్నలోహరిబంద గ్రామానికి చెందిన 40 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బచ్చల దుర్యోధన, అప్పన్న, డిల్లేశ్వరరావు, రాజేష్, అభి తదితరులకు ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష కండువాలు కప్పి ఆహ్వానించారు. బుడార్శింగి పంచాయతీ మరదమేక గ్రామానికి చెందిన 20 కుటుంబాలు, బేతాళపురం పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. హరిపురంలో మాజీ సర్పంచ్ కొత్ర మోహిని, కొత్ర హరినారాయణ వైసీపీని వీడి మాజీ మంత్రి శివాజీ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ నాయకులు కొర్ల కన్నారావు, దాసరి తాతారావు, డొంకూరు తిరుపతిరావు, బావన దుర్యోధన, కారి ఈశ్వరరావు, కర్రయ్య, తాతారావు, వజ్జ బాబూరావు, గాలి కృష్ణారావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, పీరుకట్ల విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** కొండవూరులో సోమవారం ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొల్లి రమేష్‌తో పాటు 100 మంది అనుచరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. యాదవులకు టీడీపీ హయాంలోనే మేలు జరిగిందని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వాడ హేమబాబుచౌదరి, మోహనరావు, శశిభూషణ్, గొరకల వసంతరావు, జనసేన నాయకులు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



పలాస: టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న గౌతు శిరీష

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులుంటే తెలపండి

టెక్కలి: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఏవైనా ఇబ్బందులుంటే తెలియజేయాలని ఎన్నికల పరిశీలకుడు సందీప్ శర్మ వివిధ పార్టీల నేతలను అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే సి-విజిల్, సువిధ యాప్‌లు అందుబాటులో ఉన్నాయని, వాటి ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ మాట్లాడుతూ ఎన్నికల్లో వలంటీర్లు ఏజెంట్లుగా ఉండరాదని, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏజెంట్లుగా పనికిరారన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించండి

హిరమండలం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పక్షాలు, ప్రజలు సహకరించాలని కొత్తూరు సీఐ వేణుగోపాలరావు అన్నారు. సోమవారం కిట్టాలపాడులో గ్రామ స్థులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా సహకరించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రత్యేకంగా నిఘా ఉంటుందని, ఏ చిన్న తప్పుచేసినా క్షణాల్లో తెలిసిపో తుందన్నారు. తర్వాత తీవ్ర పరిణామాలు ఎదురౌతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ స్వామి పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎన్నికల వ్యయాల నమోదు

కలెక్టరేట్: పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చును వారి రిజిస్టర్‌లతో సంబంధం లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తమ రిజిస్టర్లలో పక్కాగా నమోదు చేస్తామని సాధారణ ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఆయన శ్రీకాకుళం లోక్‌సభ, శ్రీకాకుళం, ఆముదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఏజెంట్లతో కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నామినేషన్ వేసినప్పటి నుంచి ఖర్చును లెక్కిస్తామని, తమ వద్ద ఉన్న రిజిసర్లలో ఖర్చును సరిపోల్చి చూస్తామన్నారు. తేడా ఉంటే నోటీసులు జారీ చేస్తామని, సమావేశంలో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

గెడ్డకంచరాంలో కార్డెన్ సెర్చ్

జి.సిగడాం: గెడ్డకంచరాం గ్రామంలో సోమవారం జేఆర్ పురం సర్కిల్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా సహకరించాలన్నారు. ఎటువంటి ధ్రువ పత్రాలు లేని రెండు వాహనాలను సీజ్ చేశారు. జి.సిగడాం, లావేరు ఎస్ఐలు వై.మధుసూదనరావు, సీహెచ్ స్వామినాయుడు పాల్గొన్నారు. ఎస్ఐ మధుసూదనరావు మదుపాం, చెట్టుపొదిలాం అవగాహన సదస్సును నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి తగాదాలు లేకుండా ఓటును వినియోగించుకోవాలన్నారు.

విద్యా విధానంలో మార్పుతో ఉన్నత లక్ష్యాలు



వార్షికోత్సవం దృశ్యం

శ్రీకాకుళం క్రైం: బట్టీ పట్టే విధానానికి స్వస్తిపలికి విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చి ఉన్నత లక్ష్యాలు సాధిస్తున్నామని గ్లోబల్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌చైర్మన్ ఎం.ప్రసాదరావు అన్నారు. గ్లోబల్ స్కూల్ ఐదో వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్, సెక్రటరీ వై.సారికా రెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా: ఎన్ఈఆర్



అరిణాం అక్కివలసలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, చిత్రంలో టీడీపీ సీనియర్ నేత చౌదరి నారాయణ మూర్తి తదితరులు

రణస్థలం: తనకు ఒక అవకాశం ఇస్తే ఎచ్చెర్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస, అల్లినగరం, చిలకపాలెం, ఎచ్చెర్ల, జరజాం, ముద్దాడ, కొంగరాం, దోమాం తదితర గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఎమ్మెల్యేగా తనకు కమలం, ఎంపీగా కలిశెట్టి అప్పల నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, పార్టీ ఎచ్చెర్ల మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కూటమి నేతలు గట్టెం శివరామ్, సంపతిరావు నాగేశ్వరరావు, గాడు రామారావు, మెండ రాజా రావు, నక్క లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల్ని నట్టేట ముంచనున్న జగన్: అచ్చెన్న

టెక్కలి: రైతులను మరోసారి ముంచేందుకు జగన్ కుట్రలు పన్నుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం చిన్నసాన, జియ్యన్నపేటల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం తిరిగి గాడిలో పడేందుకు కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు కింజరాపు హరివరప్రసాద్, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, పూజారి శైలజ, నంబాళ్ల శ్రీనివాస్, కామేసు, నంబాళ్ల రాజశేఖర్, ఎండ నాగేశ్వరరావు, వాన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సంతబొమ్మాళి: టీడీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

వైసీపీ నుంచి టీడీపీలోకి..

సంతబొమ్మాళి/టెక్కలి: నియోజకవర్గం లోని పలు గ్రామాల నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలు సోమవారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. సంతబొమ్మాళి మండలం ఉమిలాడ పంచాయతీ ఉప సర్పంచ్ దామోదర్, మాజీ ఉప సర్పంచ్ అట్ల అప్పారావుతో పాటు 50 కుటుంబాలు సోమవారం వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నందిగాం మండలం పోలవరం నుంచి పది కుటుంబాలు, జమ్మిపేట నుంచి పది, వల్లభరాయుడుపేట నుంచి 30, పెంటూరు గ్రామం నుంచి 20, ఆనందపురం నుంచి పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. టెక్కలి మండలం సీతాపురం నుంచి ఎండ శ్రీనివాసరావుతో పాటు పది కుటుంబాలు టీడీపీలో చేరాయి.

టీడీపీకి రెల్లికుల సంక్షేమ సంఘం మద్దతు

ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి రెల్లికుల సంక్షేమ సంఘం మద్దతు తెలుపుతోందని ఆ సంఘ నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం నిమ్మాడలో అనుచరులతో కలిసి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు చుక్కాకుల రమణమ్మ, పొడుగు కుమార్ ఉన్నారు.

గెలిపించండి.. సేవకుడిగా పనిచేస్తా: అశోక్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి మూడో సారి గెలిపించండి.. సేవకుడిగా ఉంటానని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి బెందాళం అశోక్ అన్నారు. సోమవారం తేలుకుంచి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **సోంపేట:** మండలానికి చెందిన పలువురు వైసీపీ నేతలు సోమవారం టీడీపీలో చేరారు. పాత్రఖండ మాజీ ఎంపీటీసీ ఇప్పిలి మోహనరావు, మాజీ సర్పంచ్ కీళ్ల రామారావు, బిల్లంగి షణ్ముఖరావు, ఇప్పిలి జగన్నాథరావు తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకోగా వారికి ఎమ్మెల్యే బెందాళం అశోక్ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, బేసి లోకనాథం, కోదండరావు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.



కండువా వేసి ఆహ్వానిస్తున్న అశోక్

మద్యం అక్రమ నిల్వలపై దాడులు నిర్వహించండి

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ నిల్వలపై ఎక్సైజ్, సెబ్ శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని విశాఖపట్నం సెబ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామ చంద్ర మూర్తి ఆదేశించారు. సెబ్ కార్యాలయంలో సోమవారం ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలపై ఉమ్మడి దాడులు చేయాలని, రికార్డులు పరిశీలించాలన్నారు. అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీనివాసులు, ఏఈఎస్ టి.రాజశేఖర్, సెబ్ ఈఎస్ తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ అకౌంట్‌లో పెన్షన్ జమ

ఇచ్ఛాపురం: సామాజిక పెన్షన్లను మే నెలకు సంబంధించి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎస్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. మునిసిపాలిటీలో బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ ఉన్న 3,156 మంది లబ్ధిదారులకు వారి అకౌంట్లలో నగదు జమ చేస్తామన్నారు. ఆధార్ లింక్ లేని వారు డబ్బులు జమ కాకుంటే మొబైల్ ద్వారా వార్డు అడ్మిన్ లేక వెల్ఫేర్ సెక్రటరీకి తెలియజేయాలన్నారు. మిగిలిన పెన్షన్ అందని వారికి ఇంటి వద్దకు వచ్చి నగదు అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. ● **కంచిలి:** పింఛన్లను మేలో లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో జమచేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆధార్ లింక్ ఉన్న లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమవుతాయన్నారు. అకౌంట్‌కు ఆధార్ లింక్ లేని వృద్ధులు, దివ్యాంగులకు నేరుగా ఇంటికి తెచ్చి ఇవ్వనున్నామన్నారు.